కథవరాళ్ళోయి...



దాదర్ ఎక్స్‌ప్రెస్ రేణిగుంటలో ఆగింది. గంగిరెడ్డి గొడుగురైల్లోనేఎది లేసి పంచె పైకెత్తిపట్టుకొని ప్లాట్‌ఫారం ఒక్క అంగలోదాటి ఆటోరిక్షా ఎక్కాడు

ఆటోరిక్షా ఎన్నిడొంకలు తిరిగిందో అన్ని మలుపులూ గంగిరెడ్డి మనస్సు తిరిగింది ఆ వేగంలో ఎన్ని గుంట మిట్టల్లో ఆటోచక్రాలు దొర్లామో అన్ని నిమ్నోన్నతాలనూ అతని ఆలోచనలు పయనించాయి.

ఆటోరిక్షా తిరుపతి బాలాజీ కాలనీలో రాజారెడ్డి ఇంటిముందు ఆగింది

గంగిరెడ్డి రాజారెడ్డిని వరండాలోనే చూచాడు. చిల్లర లెక్కపెట్టుతూనే అరిచాడు, "చిన్నగా డొచ్చాడా బావా?"

రాజారెడ్డినుండి వెంటనే సమాధానం లేమ. గంగిరెడ్డి వరండాలో చెప్పులు వదిలాడు. కండువాతో ముఖంమీది చెమట తుడుచుకున్నాడు.

"ఏమైంది బావా! చాలా కంగారుగా ఉన్నావు. ఏమైఁదేమిటి?" అన్నాడు రాజారెడ్డి.

"చిన్నా మూడురోజులనుంచి కనిపించడంలేదు. అవతల మీ చెల్లెలు నన్ను సాధిస్తూంది, ఎక్కడా ఆచూకీ దొరక

లేదు. నీకు ఫోన్ చెయ్యిద్దామంటే లైన్లు దొరకలేదు ఇక్కడేమన్నా చేరాదేమో నని..."

"లేదే! రాలేదే! ఒక్కడే ప్రయాణాలుగూడా చెయ్యగలిగేటంత ప్రయోజకుడయ్యాడా వాడు."

"అదే నాకూ బోధపడడంలేదు. వాడెప్పుడూ ఒక్కడే ఎక్కడికీ వెళ్లలేదు."

"ఇంట్లో ఎవ్వరన్నా ఏమైనాఅన్నారా వాణ్ణి?"

"ఇంటర్ తప్పినందుకు నేనే నాలుగు చీవాట్లు పెట్టాను. వారం రోజులనుండి నన్ను తప్పుకొని తిరుగుతున్నాడు."

"ఏంపని జేశావయ్యా! ఈ కాలం పిల్లవాళ్లను తిట్టీ కొట్టీ లాభంలేదు. వాళ్ల భవిష్యత్తును వాళ్ల అదృష్టానికి, మన కర్మకీ వదిలెయ్యాలి."

"వాడు నాకు భయపడి పారిపోయుంటాడనుకోను. అలాగే నాలుగురోజులు గడిపాడు గదా! పారిపోయ్యేవాడైతే వెంటనే పారిపొయ్యుండాలి."

"ఇప్పుడు చూడు నీ కెన్ని పాట్లొచ్చాయో!" అన్నాడు రాజారెడ్డి.

"నాకేదో అనుమానంగా ఉంది బావా! బీరువాలోనుండి రెండువందలు డబ్బు కూడా తీసుకెళ్ళాడు" మంచినీళ్లతాగతూ అన్నాడు గంగిరెడ్డి

"మిలటరీలో చేరాలని పొయ్యాడేమో చూడు" అన్నాడు రాజారెడ్డి.

"ఆ పనిజేస్తే ఇంకేం! అంతధైర్యం ఎక్కడేడ్చింది నీ చెల్లెలి కొడుక్కి" లేచాడు గంగిరెడ్డి.

"నేను వస్తా బావా! బంగారుపాళెం వెళ్ళివస్తా ...... వాళ్లత్తింటికేమైనా చేరాడేమో."

గంగిరెడ్డి ఆతురతను రాజారెడ్డి ఆపలేక పొయ్యాడు.

* * *

బంగారుపాళెంనుంచి తిరిగి ఇల్లు చేరాడు గంగిరెడ్డి. శాంతమ్మ మంచం పట్టింది.

'చిన్నా' అందరికంటే చిన్న కొడుకు శాంతమ్మకు. అందరికంటే అపురూపంగా పెంచుకుంది వాణ్ణి.

"చిన్నా టిఫిన్‌కు లే" "చిన్నా! అన్నంవేళ తప్పిపోతుందిరా" "చిన్నా! ప్రొద్దుపోయింది ఇకపడుకో" అని అన్ని వేళలా కనిపెట్టుకొని సాకింది. వాడి వయస్సుతోపాటు మమకారమూ పెంచుకొంది.

గంగిరెడ్డికేం. వాలు కుర్చీ మీద కూర్చుని వందిమాగదులను చేర్చుకొని దినమంతా కబుర్లతో గడపమన్నా గడపగలడు రోజులూ, వారాలూ, పట్నంలో రాచకార్యాలు వెలగబెట్టమన్నా పెట్టగలడు. కన్నతల్లి కడుపుతీపి పెద్దరికాలతో పెత్తనాలతో కాలం వెళ్లబుచ్చే మగ మహరాజుల కేంతెలుస్తుంది.

"వాడేం చిన్నవాడా శాంతా! ఎక్కడికీ పోడు. రెండురోజుల్లో తిరిగి ఇల్లు



చేరకపోతే చూడు. నివ్వేమీ దిగులు పెట్టుకోకు," ప్రక్కనేకూర్చుని అన్నాడు గంగిరెడ్డి. అంత ఆప్యాయతతో శాంతమ్మతో గంగిరెడ్డి ఈ పదేళ్లలో ఎప్పుడూ పలకరించలేదు .

"మీ మూలాన్నే అంతా వచ్చింది. పిల్లలన్న తర్వాత పరీక్షలు తప్పుతారు. పాసవుతారు. అంతదానికే మీరువాడిమీద నోరు జేసుకోవాలా!" గట్టిగా అంది శాంతమ్మ.

"అంతమాత్రం గూడా అదుపు ఆజ్ఞల్లో పెట్టకపోతే వాడు బరితెగించి పోడూ?" గొంతు పెంచి అన్నాడు గంగిరెడ్డి.

"ఆఁ! మీరు చదివిన చదువుకంటే వాడేమీ తక్కువ చదవలేదు. మీ రాజకీయాలు వాడికేం రానక్కర్లేదు." ఇంత మాత్రం ధైర్యంగా శాంతమ్మ గంగిరెడ్డితో ఈ పదేళ్లలో ఎప్పుడూ మాట్లాడలేదు.

శాంతమ్మ వినయ విధేయతలను అంచనా వేయడానికి గంగిరెడ్డికి ఇది సమయంకాదు

"నన్నేమి చెయ్యమంటావు శాంతా! కాలికి బలపం గట్టుకొని నాలుగు రోజుల్నుండీ తిరుగుతూనే ఉన్నా! వాడి జాడే తెలియలేదు "

"వాడు ఎక్కడికీ పోడండీ! పోలేదండీ! చిన్నా మనసు నాకుతెలుసు వాణ్ణి ఎవరో ఎత్తుకపోయి ఉంటారండీ."

గంగిరెడ్డికి ఎలక్ట్రిక్ షాక్ తిన్నంత పనైంది. మనస్సులో కొత్త అనుమానం

తెచ్చిపెట్టింది శాంత. షాక్‌నుండి తేరు కోవడానికి కొంచెంసేపు పట్టింది, గంగి రెడ్డికి వీడేమి చిన్నపిల్లవాడా ఎత్తుక పోవడానికి. వీణ్ణి ఎత్తుకుపోయి ఏం జేస్తారు. వీడికి తిండిఖర్చు తప్పిస్తే '' మాటలైతే గట్టిగా అనగలిగాడు గానీ గంగిరెడ్డి మనస్సులో మాత్రం అనుమానం లోతుజేసుకోసాగింది.

''ఏమిజేసుకుంటా రంటారేమిటండీ! వాణ్ణేమీ అమ్ముకో నవసరంలేదు. ఇదే ఆసరాగా తీసుకొని మన దగ్గర డబ్బు లాగుతారు ముఠావాళ్ళు.'' శాంతమ్మ మంచంమీదినుంచి లేచి కూర్చుంది.

గంగిరెడ్డి లేచి వసారాలో వాలు కుర్చీలో వాలాడు. ఆలోచనలు ముసురు కున్నాయి.

నక్సలైట్లు కాదుగదా ఈ పనిజేసింది. ఆ! వాళ్లచూపుల్లో పడ్డానికి తనేమంత కోటీశ్వరుడా! లేదు. నక్సలైట్లు అలాంటి పనులు చేయరు. ముందుగా కాచుకో మంటారు. దొమ్మీలు చేస్తారు. వాణ్ణి ఎత్తుకపోయి వాళ్ల ముఠాలో చేర్చుకోరు గదా!

దొంగల ముఠాలు బాగా తిరుగు తున్నాయీ మధ్య. సూటూబూటూ వేసు కొని వ్యాన్‌లలో దిగుతున్నారట. ఆమధ్య పేపర్లో చూశాడు. మెడికల్ స్టూడెంటుని మధ్యపరగణాలలో అడవుల్లో దాచిపెట్టి లక్షరూపాయలకు బేరంపెట్టి వాళ్ల తల్లి దండ్రుల దగ్గర డబ్బు గుంజారని విన్నాడు. చిన్నాను గూడా అలా ఎత్తుక పోలేదు గదా!

"టెలిగ్రాం." ఆలోచనలను చెరి చేశాడు పోస్టుమేన్.

'అదిగో తప్పక అదే! డబ్బు సమ కూర్చుకొని తెచ్చి ఇచ్చి పిల్లవాణ్ణి విడి పించుకొని పొమ్మని ఆ ముఠావాళ్లే టెలి గ్రామ్ ఇచ్చినట్టున్నారు. ఇది తప్పక వాళ్ల పనే' వొణికేచేతుల్తో టెలిగ్రాం కవరు చించాడు.

"ఎరైవింగ్ బై బొంబే మెయిల్.... చిన్నా"

"శాంతా" గట్టిగా అరిచాడు. ''చిన్నా వస్తున్నాడు. ఈ రాత్రి మెయిల్‌కే వస్తు న్నాడు మీ అన్న చెప్పిందే నిజమేమో! వాడు మిలిటరీ ఇంటర్వ్యూకు పోయిన ట్టున్నాడు." శాంతమ్మ హృదయం తేలిక పడింది.

* * *

తెల్లవారుఝాము నాలుగుగంటలకు చిన్నా అనబడే సుధాకర్ మాసినగుడ్డల్తో, పెరిగిన జుట్టుతో, నీరసించిన కండ్లతో ఇల్లుచేరాడు. శాంతమ్మ కంట్లో ఒత్తులు వేసుకొని కాచుక్కూర్చుంది ఆవేళదాకా.

''చిన్నా" కౌగలించుకొని ఏడ్చింది శాంతమ్మ. సుధాకర్ కళ్లు నులుపు కున్నాడు

"వాడి కేమైనా తినడానికి పెట్టు ముందు. వాడిపొయ్యి వచ్చాడు" చలి కప్పు వదిలిస్తూ అన్నాడు గంగిరెడ్డి.



సుధాకర్ గుండెలమీద బరువంతా దిగిపోయింది. తండ్రి రేసుకుక్కలా దూకుతాడనుకొన్న సుధాకర్‌కు గంగిరెడ్డి ప్రవర్తన లేని ఉత్సాహాన్నిచ్చింది.

శాంతమ్మ కాఫీ చేసి ఇచ్చింది. సుధాకర్ త్రాగుతున్నాడు.

"నిన్నుగురించి మీ నాయన వెతకని చోటు లేదురా! వారంరోజులైంది నేను ఎంగిలిపడి'' కండ్లనీళ్లు తుడుచుకుంటూ అంది శాంతమ్మ.

"వాడి మానాన వాడు పోతే దిగులు పడనవసరం లేదు. ఏ దొంగలముఠా వాళ్లైనా డబ్బుకోసం ఎత్తుకపొయ్యేంటారనే భయమంతా" అన్నాడు గంగిరెడ్డి

"అదే జరిగిందమ్మా......అదే జరిగింది'' ఆవేశంతో అన్నాడు సుధాకర్.

నిర్ఘాంతపోయాడు గంగిరెడ్డి.

''చూశారా! చూశారా! నేనన్నంతపనీ జరిగింది. అమ్మో! అమ్మో! నా బిడ్డ ప్రాణాలతో తిరిగి వచ్చాడు. అంతా దేవుడిదయ." గుండెమీద చెయ్యివేసి అంది శాంతమ్మ.

సుధాకర్ తలవంచుకొని కూర్చున్నాడు.

''వాళ్లు డబ్బుకోసం ప్రాణాలు తీయడానికి గూడా తెగిస్తారట అలా జరిగితే ఇంకేమైనా ఉందా" అంది శాంతమ్మ సుధాకర్ నుదురు ముద్దుపెట్టుకుంది.

"అసలేమిజరిగిందిరా! డబ్బుకోసం ఎత్తుకపొయ్యిందే మరి వదలేశారే" అనుమానంగా అడిగాడు గంగిరెడ్డి.

''మీ కోర్టు ప్రశ్నలు మాని వినండి అసలేమి జరిగిందో!'' విదిలింపుగా అంది శాంతమ్మ.

"అంతా చెపుతా వినమ్మా! ఆ రోజు నేను నందిమండలం పోవడానికి బస్ కోసం రోడ్డుమీద కాచుకొని కూర్చు

న్నానా.... చెప్పటానికి ఉపక్రమించాడు సుధాకర్.

"నందిమండలం ఎందుకూ!'' అంటుకున్నాడు గంగిరెడ్డి.

"మార్కులు తెచ్చుకుందామని పోతున్నాను. రోడ్డుమీద నే నొక్కణ్ణే ఒక వ్యానువచ్చి ఆగింది. దానిలో డ్రైవరు కాక ఇంకా నలుగురు మనుషులున్నారు. అంతా రౌడీల్లాగా ఉన్నారు నల్లగళ్ల కోట్లూ, జీన్సు, మెడకురుమాళ్లూ, తలకు టోపీలూ, పొగపైపులు అంతా సినిమాలో ఉన్నట్టే ఉన్నారు.''

శాంతమ్మకు గుండె ఝల్లు మన్నది. చిన్నవాళ్లను చూచి ఝడుసుకొని ఉంటాడు తెల్లవారితే దిష్టితియ్యాలి అనుకొంది.

''వ్యాను నిలిపి నా జుబ్బా పట్టుకొని లాగి వ్యానులో తోశారు. జేబులన్నీ వెతికారు. డబ్బు తియ్యమన్నారు. బస్‌చార్జికి తప్ప నాదగ్గర డబ్బెక్కడిదీ."

"మరి ఇక్కడ బీరువాలో రెండు వందలు పోయాయి ఏమైనట్టూ?" అనుమానంగా అడిగాడు గంగిరెడ్డి.

''వాటి విషయం నాకేమి తెలియదమ్మా! అవి నాదగ్గరుండి ఉంటే అవి తీసుకొని నన్నిక్కడే వదిలేసి ఉండేవాళ్లు" ఏడ్చాడు సుధాకర్.

"అబ్బా! మీ రుండండీ! వాడసలే భయపడి పొయ్యుంటేనూ. అదేదో మీరే తీసి మరచిపొయ్యుంటారు.''

''రోడ్డుమీద అరవకపొయ్యావా వీడు" గంగిరెడ్డి అన్నాడు.

"ఆఁ! అరచిఉంటే మీరు పరుగెత్తుకెళ్ళి రక్షించేవారే'' శాంతమ్మ ఠక్కున అనేసింది.

''వ్యానులోకి తోసి తలుపులు బిగించారు. నా కేదో మత్తుపదార్థం లాంటిది వాసన జూపించారు. స్పృహతప్పి పడిపొయ్యాను."

శాంతమ్మకు గుండెదడ ఎక్కువైంది. గంగిరెడ్డి మనస్సులో నొచ్చుకున్నాడు. రక్తసంబంధం ఆలాంటిది. ఊహించుకుంటేనే భయమేస్తుంది.

''అలాగ ఎంతదూరం వెళ్లారో వాళ్లు! నాకు రాత్రికిగానీ మెలుకువ రాలేదు."

"వాళ్లు తెలుగోళ్లు కాదా!" అన్నాడు గంగిరెడ్డి.

లేదు! అంతా హిందీ మాట్లాడుతున్నారు. నాకు మెళుకువ వచ్చేటప్పటికి ఒక భూత్‌బంగళాలో ఉన్నాను. చుట్టూ ఎక్కడా ఇళ్లు ఉన్నట్లు కనిపించలేదు.''

గంగిరెడ్డి ఆసక్తిగా వింటున్నాడు.

"ఆ రాత్రంతా నాకు జాగరణే. తినడానికి ఏమీ ఇవ్వలేదు వాళ్లు."

శాంతమ్మకు కడుపుకోతలాగుంది.

''ప్రొద్దున్నే మళ్లీ తయారయ్యారు వాళ్లు నలుగురూ. నన్ను నాన్నకు జాబు వ్రాయమన్నారు. యాభైవేలు రూపాయలు తీసికొని వాళ్ళిచ్చిన అడ్రసుకు వచ్చి కలుసుకొని ఆ డబ్బిచ్చి, నన్ను



తీసుకపోమ్మని వ్రాయమన్నారు. వారం రోజుల్లో డబ్బు చేర్చకపోతే నా ప్రాణాలు తీస్తామని వ్రాయమన్నారు."

శాంతమ్మకు చివరిమాటతో పిడుగు పడ్డట్టయింది.

"నిన్ను రాయమనడ మెందుకూ! వాళ్ళే రాయొచ్చుగా" అనుమానంగా అడిగాడు గంగిరెడ్డి.

"వాళ్లదస్తూరీ బయటపడుతుందని. పైగా నాదస్తూరీ ఉంటే మీరు తప్పక నమ్ముతారనీ'' తడుముకోకుండా జవాబు చెప్పాడు సుధాకర్.

"జాబు మాసి పోలీసు రిపోర్టులాంటిది ఇచ్చే పక్షంలో అక్కడ నా ప్రాణాలకు ముప్పని గూడా వ్రాయమన్నారు. నేను వాళ్ల మాటలకు లొంగలేదు. నన్నెన్ని బాధలు పెట్టినా నా మనస్సు మార్చుకోలేదు''

"నా నాయనే! నా నాయనే!" బుగ్గలు నొక్కింది శాంతమ్మ.

"వాళ్లుపెట్టిన హింసలు ఈ జన్మంతా మరుపురాదమ్మా."

"సుధాకర్‌ను కొరడాలతో కొట్టినట్టూ, సలసలకాగే నూనెలో చేతులు ముంచమన్నట్టు, ఎలక్ట్రిక్ కుర్చీలో కూర్చోబెట్టి స్విచ్ నొక్కినట్టూ, కత్తుల పంజరంలో బంధించినట్టూ వివిధరకాలైన బాధలు పెట్టినట్టు శాంతమ్మ కళ్ల ముందు రీలు తిరిగింది, సొమ్మసిల్లి తేరుకుంది.

గంగిరెడ్డి హృదయం బరువెక్కింది.

"నేను వాళ్లకు లొంగకపొయ్యేటప్పటికి నాలుగు రోజుల్లో అక్కడి నుంచి వాళ్ళు మకాం ఎత్తివేయాల్సి వచ్చిందేమో! మళ్లీ వ్యానులో ఎక్కించి తలుపులు బిగించి రోడ్డుమీద పడ్డారు."

"చివరికి ఎలా తప్పించుకొని రాగలి గావురా?" ఆదుర్దాగా అడిగాడు గంగి రెడ్డి.

"వ్యానులో అంతా తాగి పడి పోయారు. డ్రైవరు మధ్యలో వ్యాను నిలిపి కాలు మడుచుకోవడానికి వెళ్ళాడు. వ్యాను వెనక తలుపు మెల్లగా తెరిచాను. అలికిడి లేకుండా తిన్నగా వ్యానుదిగి పొదలమాటున నక్కాను. డ్రైవరువ్యాను ఎక్కాడు నా కళ్లముందే వ్యాను దూసుక పోయింది."

చాలా తేలికగా తప్పించుకొన్నందుకు సంతోషపడ్డాడు గంగిరెడ్డి. యాభై వేలు బరువూ తనకు తొలగిపోయినందుకు వెయ్యి దేవుళ్లకు నమస్కరించాడు మనస్సులో.

"వెంటనే ఎదురొస్తున్న బస్‌పట్టుకొని పట్నంచేరాను తీరాచూస్తే అది మద్రాసు. అక్కడనుండి మీకు టెలిగ్రాం ఇచ్చాను." పెద్దగా ఊపిరి పీల్చాడు సుధాకర్.

"అంతా ఆ ఏడుకొండలవాడి దయ. నా ఉపవాసాల ఫలితం. ఏమండీ పై వారమే తిరుపతికి వెళ్ళి మొక్కు చెల్లించి వద్దామండీ!" శాంతమ్మ స్వరంలో ఎంతో నిబ్బరం ఉంది.

కథ సుఖాంతమైనందుకు గంగిరెడ్డి కుటుంబం దేవుడికి ఋణపడింది.

బ్యాంకులోపని పూర్తి జేసుకొని బయటికి వచ్చిన గంగిరెడ్డికి వకీలు సుబ్బారావు కనిపించాడు. సుబ్బారావుకు గంగిరెడ్డి క్లయింటు. "ఏం గంగిరెడ్డీ! బాగు న్నావా? మీ చిన్నవాడు సుధాకర్ మద్రాసులో చదువుతున్నాడా," అడిగాడు సుబ్బారావు.

"లేదు స్వామీ! ఏం అలా అడిగారు" అన్నాడు గంగిరెడ్డి

"పోయినవారం నేను మద్రాసులో టూరిస్టు హోంలో ఉన్నాను. మీవా డక్కడే కొంతమంది పిల్లవాండ్లతో కని పించాడు. రెండురోజుల తర్వాత మళ్లీ సినిమాలో కనిపించాడు," మామూలుగానే అన్నాడు సుబ్బారావు.

"నిజంగానా!" ఆశ్చర్యంగా అడి గాడు గంగిరెడ్డి.

"నిజంగానేనయ్యా! నేను పలక రించాను గూడా. అక్కడేం జేస్తున్నా వన్నాను. అక్కడేఉంటున్నానన్నాడు." వెళ్ళిపొయ్యాడు సుబ్బారావు.

గంగిరెడ్డికి బీరువాలోంచి పోయిన రెండువందల రూపాయలకు ఖర్చు తెలిసి పోయింది. సుధాకర్ విషవలయంలో నుండి తప్పించుకొని రాలేదు మాటల వలయంలో తననూ,శాంతనూ త్రోశాడు. కథను బలమైన కాళ్లమీద నడిపించాడు.

సుధాకర్ దృష్టిలో వాడి తండ్రి గంగిరెడ్డి కాదు..........గంగి రెద్దు.